


ప్రొద్దుట్నుంచీ తనలో తాను విపరీతంగా ఆలోచిస్తోంది అరుంధతి. కిటికీ లోంచి బయటకి చూసింది. ఆకాశం కారు మేఘాలు భారంగా కదులుతున్నాయి. ఏ క్షణములోనైనా కుంభవృష్టి కురవొచ్చుననిపిస్తోంది. ఈదురుగాలి బలంగా వీస్తోంది. దూరంగా కొబ్బరిచెట్లు ఉన్మత్తుగా ఇటూ అటూ ఊగుతున్నాయి.

ఎపుడెపుడు ఈ శ్రావణమాసం వెళ్లిపోతుందా! అని ఆమె మనసు ఎదురుచూస్తోంది.

అసలు వీళ్లు మనుషులేనా? చదువుండీ, సంస్కారం లేనివాళ్లని ఏమని పిలవాలి తనలో తాను పలుమార్లు ప్రశ్నించుకుంది.

వారం రోజులుగా ఉద్యోగానికి వెళ్లడంలేదు. మనసు బావుండక, సెలవు తీసుకొని ఇంట్లోనే ఉండిపోయింది.

ఎంతగా మరిచిపోదగామనుకున్నా, మరిచిపోలేక పోతోంది, అరుంధతి. పడుకున్నా, కూర్చున్నా, అన్నం తింటున్నా, ఆవే మాటలు మదిలో మెదలసాగాయి.

ఆగస్టు 13వ తేదీ సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. స్త్రీలందరూ హర్షించతగ్గ తీర్పు అది.

కలసి మెలసి పని చేయవలసిన చోట, కొందరు తమలో జీర్ణించుకొని పోయిన అనాగరికతను ప్రదర్శిస్తారు. ఉద్యోగినులను అవహేళన చేయడమో, శారీరకంగా, మానసికంగా, లైంగికంగా హింసించి, పాశవిక ఆనందం పొందడం కొందరికి హాబీగా మారుతుంది.

కొన్ని సందర్భాలలో అది ప్రాణాంతకంగా కూడా పరిణమిస్తుంది. ఈ పరిస్థితి ఎంత దుర్భరమో, అనిభవిస్తే తప్ప అర్థంకాదు. హుందాగా, గౌరవంగా పని చేసుకునే హక్కు స్త్రీకి ఉంది. పురుషులు తమ పైశాచికత్వంతో వారిని హింసిస్తే, శిక్షపడేటట్టు సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. సంతోషించ తగ్గవిషయమే.

కానీ తనది కొత్త సమస్య. ఎవరన్నారో గాని, మహానుభావులు, చేయెత్తి దణ్ణం పెట్టొచ్చు. స్త్రీకి స్త్రీయే మొదటి శత్రువు అని అది అక్షరాలా నిజం చేసింది ప్రభావతి.

అరుంధతి మదిలో గతం లీలగా మెదిలింది. భర్త సంజీవరావు బ్యాంకులో ఆఫీసరు. మంచి హోదా గల ఉద్యోగం. ఇద్దరు మగ పిల్లలు, చక్కని పిల్లలు, చల్లని సంసారం. ఏ లోటూ లేకుండా, ఎట్టి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా, హాయిగా సాగిపోతుండేది.

బ్యాంక్ పనిమీద బొంబే వెళ్లిన సంజీవరావు రైలు ప్రమాదంలో చనిపోయాడు. స్ఫటిక సదృశ్యమైన జీవితం ముక్కలైంది. బ్రతుకు పూతోటను తుఫాను నాశనం చేసినట్లైంది.

సంజీవరావు భార్య అరుంధతికి బ్యాంకు వాళ్లు ఉద్యోగమిచ్చారు. మొదట ఇష్టంలేకపోయినా, పరిస్థితులకు తలవొగ్గి ఉద్యోగం చేయడానికి నిర్ణయించుకుంది. అసలే భర్తను కోల్పోయిన దురదృష్టవంతురాలు. దానికి తోడు చిన్న పిల్లలు.

డిగ్రీ చదువు ఉంది కాబట్టి సరిపోయింది. లేకపోతే తన బ్రతుకు ఏమయ్యేదో అంతుచిక్కని ప్రశ్న. ఇంటిపట్టున హాయిగా జీవితం వెళ్లబుచ్చుతున్న అరుంధతి. ఈ రోజు జీవితాన్ని ముందుకు నడిపించుకోవడానికి బయటకి రావలసిన వచ్చింది.

విశాలమైన బ్యాంకింగ్ హాలు. క్రమపద్ధతిలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు. వాటికెదురుగా అందంగా, ఠీవిగా కూర్చున్న స్టాఫు. ఓ ప్రక్కగా మేనేజర్‌గారి క్యాబిన్. మరో ప్రక్క క్యాష్ కౌంటర్స్.

అప్పుడప్పుడు భర్త కోసం బ్యాంక్ వెళ్లినప్పటి రోజులు గుర్తుకొచ్చాయి. కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఈ రోజు పరిస్థితి పూర్తిగా వేరు. ఉద్యోగం కోసం బ్యాంకులోకి అడుగుపెట్టింది అరుంధతి. తనకి ఇదంతా కొత్త. ఇంత వరకు భర్త వెనుక భార్యగా గడిపింది. పరిస్థితి తారుమారై తానే ముందుండి పిల్లలను పైకి తీసుకొని రావాల్సిన అవసరం, బాధ్యత మీదపడింది.

తప్పనిసరి పరిస్థితి. గుండెలోతుల్లోంచి ఉబికే దుఃఖాన్ని పెదవి బిగువులో ఆపుకుంది అరుంధతి.

మొత్తం ఇరవై మంది సిబ్బంది. అందులో ఆరుగురు ఆడవాళ్లు. మిగతా వాళ్లు మగవాళ్లు. చక్కని దుస్తులతో, హుందాగా, గర్వం తొణికిసలాడుతున్న ఉద్యోగులు. ఆడవాళ్లు చేతులకు అరడజనుకు పైగా బంగారు గాజులతో, వ్రేళ్లకు బంగారు ఉంగరాలు. చెవులకు తగ్గట్టు అలంకారాలు. మ్యాచింగ్ బొట్టుబిళ్లలతో, మ్యాచింగ్ బ్లౌజ్‌లతో, బుట్టబొమ్మల్లా తయారైవచ్చి, ఎవరి సీట్లలో వాళ్లు యంత్రాల్లా పనిచేసుకొని పోతున్నారు.

మొదటి రోజు మేనేజర్ అందరికీ అరుంధతిని పరిచయం చేశాడు.

దాదాపు అందరూ పలుకరింపుగా నవ్వుతూ, తలూపుతూ, నమస్కారాలు చేస్తూ ఆమెను పలుకరించారు. ఒక పక్క మనసులో బాధగా ఉన్నా, మరో పక్క ఇంత మంచి సంస్కారవంతులైన వారి మధ్య పనిచేయడం కష్టమనుకోలేదు.

రోజులు గడిచే కొద్దీ, అసలు సంగతులు బయటపడసాగాయి. మగవాళ్లలో దాదాపు అందరూ మంచి వాళ్లే. అవసరమైతేనే మాట్లాడేవాళ్లు. లేకపోతే లేదు. ఆడవాళ్లలో ఎవరికి వాళ్లు గొప్పగా ప్రవర్తించే వాళ్లు.

ఒక్క శారద తప్ప. శారద తన ఈడుదే. ఇంకా పెళ్లికాలేదు. శారద తనకు నచ్చిన కొలీగ్. ఆమెది అందరికంటే పూర్తిగా విభిన్నమైన మనస్తత్వం. ఎప్పుటూ గుంభనంగా, తన పని తాను చేసుకొని పోతుంది. అనవసరమైన వాగ్వివాదాలకు, కల్లబొల్లి కబుర్లకు తావీయదు. ఎదుటి వాళ్లను హీనంగా చూడడం, చులకనగా మాట్లాడడం చేయని, ఆమె ప్రవర్తన తనను ఎంతగానో ముగ్ధురాలిని చేసింది.

ప్రభావతి ఇందుకు పూర్తిగా భిన్నమైన మనిషి. ఎంతసేపూ తన గొప్ప, తన దర్పం ప్రకటించుకోవాలనీ, ప్రదర్శించుకోవాలనీ ఉబలాటపడుతుంది. ఏడు వారాల నగలు, ఏడు వారాల గాజులు, ఇలా ఎన్నో రోజుకు రోజు మార్చుకొని వస్తూ, అందరికీ చూపెడుతూ తన గొప్ప చాటుకుంటుంది.



టిఫిన్‌బాక్స్ పట్టుకొని వెళ్తున్న సుబ్బారావ్‌ని "ఎక్కడికి వెళ్తున్నారండీ?" అడిగాడు వెంకట్రావు.

"ఏ రైలు కిందో తలపెట్టి ఆత్మహత్య చేసుకుందామని..." చెప్పాడు సుబ్బారావు.

మరి ఆ టిఫిన్ బాక్స్ ఎందుకు?"

"రైళ్లు లేట్‌గా వస్తాయి కదా ఆకలితో చావడం ఎందుకని టిఫిన్‌బాక్స్ తీసుకెళ్తున్నాను."

— ఎస్.శివానంద్

దానికి తోడు ఈ శ్రావణమాసం, చదువుండీ సంస్కారం లేని మనుషులంటే ప్రభావతిని చూపెట్టడంలో తప్పులేదు.

వారం రోజుల క్రితం జరిగిన సంఘటన తనను ఎంత గానో కలచివేసింది. మనసును ముక్కలు ముక్కలుగా చేసింది. "ఓరి! భగవంతుడా! పుణ్యస్త్రీగా నన్నెందుకు తీసుకొనిపోలేదు?" అని కనిపించని దేవుణ్ణి వేడుకుంది అరుంధతి.

మంగళవారం, కాళ్ళకు పసుపు రాసుకొని, చేతికి తోరం కట్టుకొని, ధగధగ లాడేటట్టు చీరతో బ్యాంకుకు వచ్చింది ప్రభావతి.

అంతటితో ఊరుకుంటే సరిపోయేది. కావాలని తన గొప్ప తనం, ముత్తైదువతనం ఎత్తి చూపెట్టుకోవాలన్న కాంక్ష ఉన్నట్లు, తన బ్యాగ్‌లో ఇంటి నుండి శనగలు, అరటిపళ్లు, తమలపాకులూ, వక్కపొడితో బాటు రెండు వెండి గిన్నెలుకూడా తెచ్చింది. ఒక వెండి గిన్నెలో కుంకుమ, మరో వెడి గిన్నెలో పసుపు.

వెండి గిన్నెల్లోని పసుపూ, కుంకుమలను ఆ ఆరుమందిలోనూ ముగ్గురికి ఇచ్చింది ప్రభావతి. ఆ తర్వాత బొట్టుపెట్టి తాంబూలాలతో బాటు "ఇంట్లో పూసినవి" అని చెప్పి మూరెడు మూరెడు పూలు ముగ్గురికి పంచింది ప్రభావతి.

పూలను జడల్లో అలంకరిస్తున్న వాళ్లను చూసి కించిత్తు గర్వంగా, విరగబడి నవ్వింది ప్రభావతి.

ఆ మిగిలిన ముగ్గురిలో అరుంధతి ఒకతె. తనతో బాటు శారద, మరొకమ్మాయి మాన్పిడి ఊర్కోడమే తప్ప ఏమీ చేయలేని, చెప్పలేని దుస్థితి.

"తనంటే తలరాత చెడిందికావొచ్చు" మిగిలిన ఇద్దరూ ఆడవాళ్లే. అయినా తక్కువ వాళ్లని, ఆమె వాళ్లను త్రోసిపారేస్తుంది. దాంతో అరుంధతికి ఎక్కడో లోటుకనిపిస్తుంది.

శ్రావణమాసంలో మంగళవారం గానీ, శుక్రవారం గానీ వస్తున్నాయంటే, గుండెలో ఒకటే దడ. కాళ్లలో వణుకూ మొదలవుతాయి అరుంధతికి.

భర్త ఉన్న రోజుల్లో తానూ ఇలాంటి వ్రతాలూ, నోములు ఇంట్లో చేసుకున్నదే. కానీ, ఇంతగా విర్రవీగలేదు. ఏదో చేసింది తప్ప. ప్రదర్శించుకోవడానికి మాత్రం చేసేదికాదు.

ఆ రోజు శ్రావణమాసం శుక్రవారం. లంచ్ టేబుల్ దగ్గర జరిగిన సంఘటనతో తన మెదడు మొద్దుబారిపోయింది. కుర్చీ విరిగేలా కూర్చొన్న ప్రభావతి, తాను ఆ రోజు చేసుకొన్న పిండివంటలు, పులిహోరాల వర్ణలతో తాను ఎన్ని గంటలకు నిద్రలేచింది. ఎంతగా కష్టపడిందీ, పూసగుచ్చినట్లు చెబుతోంది. తాను చేసిన వంటకాలను భర్తా, పిల్లలు ఎలా లొట్టలు వేసుకొని ఆరగించారో, వివరిస్తున్న ప్రభావతిని పట్ట శక్యం కాలేదు.

తన భర్త అమృతం తాగి మృత్యుంజయుడైనట్లు, ఫోజు గొడుతూ, తాను జీవితాంతం సుమంగళిగా ఉంటానన్న ధీమాను మాటల్లో వ్యక్త పరుస్తోంది. పూనకం వచ్చిన దానిలా ఊగిపోతూ, మాటల్తో హోరెత్తిస్తోంది ప్రభావతి.

తాను ఎంపిక చేసుకొన్న ముగ్గిరికి టిఫిన్ డబ్బాలు తీసి తాను తెచ్చిన పులిహోరా, వంటకాలను వడ్డించింది ప్రభావతి. వాళ్లు తింటూ పొగుడుతుంటే తాను మురిసిమైమరచి పోతోంది ప్రభావతి.

మనసంతా ఈ ఆలోచనల్తో గజిబిజి అయ్యింది. ఎందుకో ఎంతగా ఆపుకున్నా ఆగని దుఃఖం గుండెలోతుల్లోంచి ఎగసి పడుతోంది. కళ్లలోంచి అప్రయత్నంగా కన్నీరు ఉబికి వస్తుంది. ఎదురుగా గోడకు భర్త ఫోటో. నవ్వుతూ, ధైర్యం చెబుతూ, సముదాయిస్తున్నట్లుగా భావించింది.

ఇంతలో కాలింగ్ బెల్ మ్రోగింది. లేచి తలుపు తీసింది. ఎదురుగా పిల్లలు. తన ప్రాణానికి ప్రాణమైన పిల్లలు. తన పేగును తెంచుకొని పుట్టిన పిల్లలు. వాళ్ల కోసమైనా తాను ఇలాంటివి భరించాల్సిందేనని మనసును రాయిచేసుకుంది. తనకు తాను ధైర్యం చెప్పుకుంది అరుంధతి.

అశ్లీల సాహిత్యం, చూపించడమో, బూతు బొమ్మల్ని ప్రదర్శించమో, లైంగిక వేధింపులుగా సుప్రీంకోర్టు ఘనంగా తీర్పునిచ్చింది. అయితే తనలాంటి, భర్తను కోల్పోయిన స్త్రీ, అయిదవతనాన్ని పోగొట్టుకొన్న స్త్రీ, జీవించాలన్నా, పిల్లలను బ్రతికించుకోవాలన్నా, ప్రభావతి లాంటి వారికి, ఏ చట్టం ఏ కోర్టు ఎలాంటి శిక్ష విధిస్తుందో? ఈ దుర్భరస్థితి అంతమయ్యేదెప్పుడో అని భారంగా ఊపిరి పీల్చింది అరుంధతి. •